
సాక్షి పల్నాడు

శుక్రవారం : 21 : మార్చి : 2025



హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభం

విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి 10వ అండర్-19 జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు విజయవాడ ఆంధ్రా లయోల కాలేజీ ప్రాంగణంలో గురువారం ప్రారంభమయ్యాయి.



సాగర్ నీటి మట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటి మట్టం గురువారం 519.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి గుడివాడకు చెందిన సుంకర బాలాంబ కుటుంబం రూ. 2,00,116 విరాళాన్ని అందజేసింది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహర్ (శని)
నరసరావుపేట	6.26	4.57
గుంటూరు	6.24	4.55
బాపట్ల	6.24	4.55

న్యూస్‌రీల్

కేజీబీవీలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని 24 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి, 11వ తరగతి (ఇంటర్మీడియేట్) ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ టి.వి.సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 7,8, 9, 10,12 తరగతుల్లోనూ మిగిలిన సీట్లు భర్తీ చేసేందుకు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. దరఖాస్తులను https//apkgbv.apcfss.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన సూచించారు. వివరాలకు 9704100406, 9440642122 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

చర్లపల్లి-కన్యాకుమారి మధ్య వేసవి వారాంతపు ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం సమ్మర్ వారాంతపు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ గురువారం తెలిపారు. చర్లపల్లి-కన్యాకుమారి వయా గుంటూరు డివిజన్ మీదుగా ఏప్రిల్ 2 నుంచి జూన్ 25 వరకు ప్రత్యేక రైలు(07230) ప్రతి బుధవారం నడపనున్నట్టు వివరించారు. ఈ రైలు చర్లపల్లి స్టేషన్ నుంచి రాత్రి 9.50 గంటలకు బయలుదేరి రెండో రోజు అర్ధరాత్రి 2.30 గంటలకు కన్యాకుమారి స్టేషన్‌కు చేరుకుంటుందని వెల్లడించారు. కన్యాకుమారి-చర్లపల్లి రైలు(07229) ఏప్రిల్ 4 నుంచి జూన్ 27 ప్రతి శుక్రవారం నడపనున్నట్టు వివరించారు. ఈ రైలు కన్యాకుమారి స్టేషన్ నుంచి తెల్లవారుజామున 5.15 గంటలకు బయలు దేరి మరుసటి రోజు రాత్రి 11.40 గంటలకు చర్లపల్లి స్టేషన్‌కు చేరుకుంటుందని వెల్లడించారు.

జయ గోవర్ధనా.. నారసింహా



మంగళగిరి టౌన్: మంగళాద్రిలోని శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం స్వామి గోవర్ధనోద్ధరణ అలంకారంలో దర్శనమిచ్చారు. స్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాన్ని ఆలయ ఈవో రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. ఉత్సవ కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన శెనగల రామహనుమాన్, శేషాంజనేయ గోపాల్‌లు వ్యవహరించారు. ఆస్థాన కైంకర్యపరులుగా దుగ్గిరాల మండలం పెదపాలెం గ్రామానికి చెందిన వాసిరెడ్డి మల్లేశ్వరరావు వ్యవహరించారు. శుక్రవారం స్వామి గజేంద్ర మోక్షం అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఈవో రామకోటిరెడ్డి తెలిపారు.

స్థానిక సంస్థల ఖాళీ స్థానాలకు 27న ఎన్నికలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని స్థానిక సంస్థల్లో వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానాలకు ఈనెల 27న ఉప ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఖాళీలను పరోక్ష విధానంలో ఎన్నికల ద్వారా భర్తీ చేయనున్నారు. ఈనెల 27న ఉదయం 10 గంటలకు నామినేషన్లు స్వీకరించిన అనంతరం మధ్యాహ్నానికి ఎన్నిక, ప్రమాణ స్వీకారంతో ప్రక్రియ ముగియనుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉప ఎన్నికల ద్వారా దుగ్గిరాల మండల పరిషత్ అధ్యక్షులు, గుంటూరు రూరల్ మండల పరిషత్ ఉపాధ్యక్ష స్థానంతో పాటు తెనాలి మండల నుంచి కో-ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది. గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌ల స్థానాల వారీగా కొల్లిపర మండలం తూములూరు, చక్రాయపాలెం, మేడికొండూరు మండలం గుండ్లపాలెం, మేడికొండూరు, దుగ్గిరాల మండలం మంచికలపూడి, ప్రత్తిపాడు మండలం తిమ్మాపురం, పెదకాకాని మండలం వెంకటకృష్ణాపురం, పొన్నూరు మండలం బ్రాహ్మణకోడూరు, చేబ్రోలు మండలం శ్రీరంగాపురంలో ఎన్నికలు జరగనున్నాయి.

తంగెడపై ఖాకీల పడగ !

- వైఎస్సార్ సీపీ నేతలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు
- హత్యాయత్నం కేసులు కూడా నమోదు చేసి వేధింపులు
- రౌడీషీట్స్ తెరచి బెదిరింపులు
- రూ.40 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని పోలీసుల ఒత్తిడి
- చెప్పినట్లు చేయకపోతే మరిన్ని కేసులు పెడతామని హెచ్చరికలు
- పోలీసుల తీరుపై హైకోర్టుకు వెళ్లిన వైఎస్సార్ సీపీ నేతలు

ఎస్..బాస్ అంటూ కూటమి నేతల కనుసన్నల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు లక్ష్యంగా పోలీసులు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీలకతీతంగా వ్యవహరించాల్సింది పోయి అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారు. ప్రతిపక్ష పార్టీ నేతలను టార్గెట్ చేస్తున్నారు. సామదాన దండోపాయాలను ప్రయోగిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టి ఇబ్బంది పెట్టాలని అధికార పార్టీ నేతల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే వాటిని అమలు చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. అధికార పార్టీ నేతల మెప్పు కోసం పోలీసులు పడుతున్న హైరానా పల్నాడు జిల్లాలో సంచలనంగా మారుతోంది. తాజాగా పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగెడ గ్రామాన్ని పోలీసులు టార్గెట్ చేశారు.

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : తంగెడ గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని పోలీసులు బలవంతంగా తప్పుడు కేసులు పెట్టించి ఇబ్బంది పెడుతున్నారు. గ్రామంలో ఏ ఒక్క నేతను వదిలిపెట్టకుండా కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఒక పథకం ప్రకారం పోలీసులు పెడుతున్న అక్రమ కేసులు, నిర్బంధంపై జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. అసలు దాచేపల్లిలో ఏం జరుగుతుందనే దానిపై ఉన్నతాధికారులు నిఘా వర్గాల ద్వారా సమాచారం సేకరిస్తున్నట్లు తెలిసింది. దాచేపల్లి పోలీసులు వ్యవహరిస్తున్న తీరు కూడా తీవ్ర వివాదాస్పదంగా మారుతోంది. ఏ క్షణంలోనైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న పోలీసులపై చర్యలు తీసుకోవచ్చుననే ప్రచారం జోరుగా జరుగుతోంది. ఇదిలా ఉండగా.. పోలీసుల తీరుపై విసిగిపోయిన వైఎస్సార్‌సీపీ నేతలు హైకోర్టును ఆశ్రయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. అక్రమ కేసులను న్యాయపరంగా ఎదుర్కోవడంతో పాటుగా దశలవారీగా ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.

పోలీసులపై ఒత్తిడి

పురాతన చరిత్ర కలిగిన తంగెడని పోలీసులు టార్గెట్ చేశారు. గతేడాది సార్వత్రిక ఎన్నికల రోజున వైఎస్సార్ సీపీ, టీడీపీ నేతలు పరస్పర దాడులు చేసుకుని పెట్రోల్ బాంబులు విసురుకున్నారు. ఈ ఘటనపై వైఎస్సార్ సీపీకి చెందిన 25 మంది, టీడీపీకి చెందిన 19 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల ఫలితాలు టీడీపీకి అనుకూలంగా రావడంతో ఈ కేసును అడ్డుపెట్టుకుని మరిన్ని కేసుల్లో వైఎస్సార్‌సీపీ నేతలను ఇరికించేలా పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. వైఎస్సార్ సీపీ నేతలకు సంబంధంలేని వ్యవహారాలను అపాదించి, తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారు.

పలువురిపై అక్రమ కేసులు

తంగెడకి చెందిన వైఎస్సార్ సీపీ నేత, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దేవళ్ల వీరాస్వామితో పాటుగా వట్టి రామిరెడ్డి, దేవళ్ల నీలిమేఘం, తండా సైదా, ఉప్పు హరికృష్ణ, గోగుల హరికృష్ణ, దేవళ్ల అంకిరాజులపై కేసులు నమోదు చేసి రౌడీషీట్ ఓపెన్ చేశారు.18 రోజుల పాటు పోలీస్‌స్టేషన్‌కి పోలీసులు పిలిపించి ఇబ్బందులు పెట్టారు. వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వీరు ప్రతి రోజూ స్టేషన్‌కి రావడం వల్ల ఆర్థికంగా చాలా నష్టపోయారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు స్టేషన్‌లో కుర్చోబెట్టి ఆ తరువాత ఇంటికి పంపించేవారు.

- తంగెడకి చెందిన వైఎస్సార్ సీపీ నేత గొగిరెడ్డి వెంకటరెడ్డి, మాదినపాటి జానీలపై కేసు నమోదు చేశారు. టీడీపీ నేత షేక్ హుస్సేన్ గొర్రెలు మేపేందుకు వెళ్లగా వెంకటరెడ్డి, జానీ చంపుతామని బెదిరించినట్లుగా సృష్టించి కేసు పెట్టారు.
- మరో వైఎస్సార్ సీపీ నేత వట్టి రామచంద్రారెడ్డిపై ఓ ఎస్సీ మహిళతో ఫిర్యాదు ఇప్పించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఒత్తిడి చేస్తున్నారు. సదరు మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీస్ ఉన్నతాధికారులు అనుమానాలు వ్యక్తం చేశారు.డివిజన్ స్థాయి పోలీస్ అధికారులు ఈ ఫిర్యాదు సరైనది కాదని పట్టించుకోకపోవడంతో గ్రీవెన్స్‌లో ఎస్పీకి ఫిర్యాదు చేసింది.
- ఇదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు ఆరికట్ల మల్లారెడ్డి, కాసర్ల జానకీరెడ్డి, ఉప్పుతల పెదనరసింహారావుపై టీడీపీ నేత షేక్ జాకీర్ హుస్సేన్‌తో ఫిర్యాదు ఇప్పించి కేసు నమోదు చేయించారు. వీరితో పాటుగా మరికొంతమందిపై కేసులు పెట్టించేందుకు టీడీపీ నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

పోలీసుల స్వామిభక్తి



తంగెడ గ్రామంలో పురాతన కోట గోడ ముఖ ద్వారం

పోలీసుల తీరుతో ప్రజల్లో భయాందోళన

దాచేపల్లి పోలీసులు వ్యవహరిస్తున్న తీరుతో ప్రజల్లో తీవ్ర భయాందోళనకు మొదలయ్యాయి. తంగెడలో ఎన్నికల రోజున జరిగిన ఘర్షణలో టీడీపీ వారికి చెందిన ఆస్తులకు నష్టం వాటిల్లిందని, అందుకుగాను రూ.40 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని వైఎస్సార్ సీపీ నేతలపై ఒత్తిడి చేస్తున్నారు. రూ.40 లక్షలు ఇస్తేనే ఈ కేసులకు పరిష్కారం దొరుకుతుందని, లేదంటే మరిన్ని కేసులు పెట్టి జైళ్లకు పంపిస్తామని బెదిరింపులకు దిగుతున్నారు. ఈ కేసుపై పోలీసులతో మాట్లాడేందుకు వైఎస్సార్‌సీపీ నేతలు ప్రయత్నాలు చేయగా ఇష్టపడలేదు. వైఎస్సార్ సీపీ వాళ్లు పోలీస్‌స్టేషన్‌కి రావటానికి వీల్లేదని హుకుం జారీ చేశారు. దీనిపై నేతలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో మరిన్ని తప్పుడు అక్రమ కేసులు పెట్టేందుకు మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈ ఘటనలో రూ.2.80 లక్షలు నష్టం జరిగినట్లుగా నాటి ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. ఈ రోజు రూ.40 లక్షలు చెల్లించమని ఒత్తిడి చేయటం ఎంత వరకు సబబు ? అని వైఎస్సార్ సీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల రోజున జరిగిన ఘర్షణలో వైఎస్సార్ సీపీకి చెందిన వారికి కూడా దెబ్బలు తగిలి ఆస్తి నష్టం జరిగింది. ఈ కేసులో పోలీసులు ఫిర్యాదుదారుడిని బెదిరించి కేసు రాజీ చేయించారు. పోలీసులు ఏకపక్షంగా అధికార పార్టీ నేతలకు సహకరిస్తూ వైఎస్సార్‌సీపీ నేతలను ఇబ్బందులు పెడుతున్నారు.



జగన్ దృష్టికి తీసుకెళ్లిన నేతలు

గురజాల నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఆ పార్టీ నేతలు తీసుకెళ్లారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కూడా ఆయన్ను కలిసి పోలీసులు కేసులు పెట్టి వేధిస్తున్న తీరును వివరించారు. ప్రధానంగా తంగెడ కేసుల్లో పోలీసులు మితిమీరి వ్యవహరిస్తున్న తీరుపై చర్చించారు. తప్పుడు ఫిర్యాదులతో అక్రమ కేసులు పెట్టి వేధించటంతో పాటుగా ఊర్లు వదిలిపెట్టి వెళ్లేలా పోలీసులు ఒత్తిడి చేస్తున్నట్లు జగన్ దృష్టికి తెచ్చారు. వైఎస్సార్‌సీపీ నేతలపై నమోదు చేసిన కేసుల్లో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్‌తో పాటుగా పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా కల్పించారు. పోలీసుల తీరుపై న్యాయ పోరాటానికి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఏజీపీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి
- వినుకొండలో నాయకుడి అక్రమ నిర్బంధంపై మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడితో కలసి సమావేశం
- ఈపూరు మండల నాయకుడు నాగేశ్వరరావు అక్రమ నిర్బంధంపై హైకోర్టులో పిటిషన్
- రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు, అక్రమ కేసులు హత్యలు తప్పా పరిపాలన ఎక్కడని పొన్నవోలు ప్రశ్న
- హిట్లర్‌ను మరపిస్తున్న చంద్రబాబు పాలన



మాట్లాడుతున్న పొన్నవోలు, పక్కన మాజీ ఎమ్మెల్యే బొల్లా, పల్నాడు లీగల్ సెల్ కన్వీనర్ మాధవి తదితరులు

వినుకొండ: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఏజీపీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈపూరు మండలం బొమ్మరాజుపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొండావర్జు నాగేశ్వరరావు యాదవ్‌ను ఈపూరు పోలీసులు గురువారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకుని దాచిపెట్టడంపై ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా చొరవతో తమ నాయకుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విషయం తెలిసిన వెంటనే హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేసినట్లు చెప్పారు. దీంతో పోలీసులు ఉక్కిరిబిక్కిరై నాగేశ్వరరావును విడిచిపెట్టారని వివరించారు. కార్యకర్తలంతా ధైర్యంగా ఉండాలని, పార్టీ అందరికీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో కార్యకర్తలను వేధించడం, భూములు లాక్కోవడం, హత్యలు, అత్యాచారాలు వంటి ఘటనలు నిత్య కృత్యంలా మారాయని తెలిపారు. వినుకొండలో రషీద్ దారుణహత్యతోపాటు, వినుకొండ రూరల్ మండలం ఏనుగుపాలెంలో మహిళపై అత్యాచారం కేసుల్లో ఇప్పటివరకూ పోలీసులు పురోగతి సాధించలేదని విమర్శించారు. హిట్లర్ పాలన కంటే దారుణంగా రాష్ట్రంలో పరిపాలన సాగుతోందని దుయ్యబట్టారు. ఒక మీడియా చానల్‌లో ప్రభుత్వ పథకాలపై మాట్లాడిన నాగేశ్వరరావును తీవ్రవాదుల కంటే దారుణంగా పొలంలో పని చేసుకుంటూ ఉండగా అదుపులోకి తీసుకోవడం ఏమిటని పొన్నవోలు ప్రశ్నించారు. పోలీసులు నాగేశ్వరరావును స్టేషనులో కాకుండా వేరేచోట నిర్బంధించి కుటుంబసభ్యులకు కూడా తెలియకుండా వ్యవహరించడాన్ని తప్పుబట్టారు. నాగేశ్వరరావు భార్య సునీత, గ్రామస్తులు, బంధువులు పోలీస్‌స్టేషన్‌లో కాపలాగా ఉండి అతడిని కాపాడుకున్న తీరు అభినందనీయమన్నారు. ఈ ఘటనతో జగన్ మాటల మనిషికాదని, చేతల మనిషి అని, సామాన్య కార్యకర్తలకు అన్యాయం జరితే ఆయన స్పందించిన తీరు ప్రశంసనీయమని తెలిపారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, జిల్లా లీగల్‌సెల్ కన్వీనర్ మాధవితోపాటు, పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి ఎం.ఎస్. ప్రసాద్ కృషి మరువలేనిదన్నారు. ప్రభుత్వం తమ కార్యకర్తలను ఎంత అణగదొక్కాలని చూస్తే అంతే వేగంగా చైతన్యవంతులు అవుతారని పేర్కొన్నారు. పోలీస్ వ్యవస్థను ఇలా కూడా వాడుకోవచ్చని చంద్రబాబు ప్రభుత్వ విధానం చూస్తుంటే అర్థమవుతోందని తెలిపారు. వారు ట్రైలర్ మాత్రమే చూపించారని, రానున్న రోజుల్లో సినిమా చూపిస్తామని హెచ్చరించారు. వినుకొండను అనకొండగా మార్చిన టీడీపీ నాయకులకు త్వరలోనే ప్రజలు బుద్ధి చెబుతారని పొన్నవోలు పేర్కొన్నారు.

ధైర్యంగా ఉండండి : బొల్లా

బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ నియోజకవర్గ కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పొన్నవోలు లాంటి సీనియర్ న్యాయవాదులు ఉన్నతకాలం భయపడేది లేదన్నారు. వినుకొండలో పేదలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. శావల్యాపురం మండలంలోని వెలమావారిపాలెంలో సాగునీరు అడిగినందుకు మహిళపై దాడి చేయడం హేయమైన చర్య అని ఖండించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి, ఎం.ఎస్. ప్రసాద్, సీనియర్ నాయకులు అమ్మిరెడ్డి అంజిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి రాజా, మున్సిపల్ వైస్ చైర్మన్ బేతం గాబ్రియేలు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డిలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

అమరేశ్వరుడికి వేలం పాటల ద్వారా రూ.54.22 లక్షల ఆదాయం



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

అమరావతి: అమరేశ్వరుడికి వేలం పాటల ద్వారా రూ.54.22 లక్షలు ఆదాయం వచ్చింది. ఆలయంలో దుకాణాలకు గురువారం బహిరంగ వేలం పాటలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి 2026 మార్చి 31 వరకు పాటదారులు వ్యాపారాలు చేసుకోవచ్చని తెలిపారు. ఆలయంలో కొబ్బరి చిప్పలు పోగు చేసుకోవడాన్ని రూ. 9.51లక్షలకు, ఆవరణలో కొబ్బరికాయలు, పూజ సామగ్రి అమ్ముకునేందుకు రూ.17.20లక్షలు, పార్కింగ్ రుసుం వసూలును రూ.10.61లక్షలకు, బొమ్మలు అమ్ముకునే హక్కుకు రూ.3.90 లక్షలకు, నదీ తీరంలో కూల్‌డ్రింక్స్ షాపునకు రూ.9.9లక్షలకు, చెప్పుల స్టాండ్ నిర్వహణకు రూ. 2.66 లక్షలకు, తలనీలాలకు రూ. 20వేలు, మొదటి ప్రాకారంలో కూల్‌డ్రింక్స్ షాపు నిర్వహణకు రూ. 1.5లక్షలకు పాడుకున్నట్లు ఆయన వివరించారు. స్వామికి ఆదాయం గత ఏడాది రూ. 49.44 లక్షలు రాగా ఈ ఏడాది రూ.54.22 లక్షలు వచ్చినట్లు చెప్పారు. గత ఏడాది కంటే రూ.4.78 లక్షలు అధికంగా వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

సిండికేట్‌తో ఆదాయానికి గండి

పాటదారులు సిండికేట్ కావడంతో అమరేశ్వరుని ఆదాయానికి గండిపడింది. ఒకటి, రెండు వ్యాపారాలకు తప్పా మిగిలిన అన్నింటిలో పాటదారులు సిండికేట్ అయ్యారు. అధికారులు కూడా పార్కింగ్, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కుకు అధిక మొత్తంలో పాట పెంచారు. మిగిలిన వ్యాపారాలకు తక్కువ మొత్తంలో పెంచి మమ అనిపించారు. ఈ విధంగా దేవుని ఆదాయానికి గండి కొట్టటం దారుణమని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

రెచ్చిపోయిన 'పచ్చ' నేత

- అధికార అహంకారంతో పేదల గుడిసెలు కూల్చివేత
- ఆందోళనకు దిగిన బాధితులు



ధర్నా చేస్తున్న బాధితులు, పీడీఎం నాయకులు

నకరికల్లు: అధికార అహంకారంతో తమ గుడిసెలను కూల్చేసిన టీడీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు ఆందోళనకు దిగారు. గుడిసెలు కూలగొట్టి భూమిని లాక్కోవాలని చూస్తున్నాడని మండలంలోని బాలాజీనగర్ తండాకు చెందిన పలువురు సుగాలీలు పీడీఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట, ఆందోళనకు దిగారు. బాధితుల తరఫున పీడీఎం పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి మాట్లాడారు. తండాకు చెందిన 37 సుగాలి కుటుంబాలకు మూడు సెంట్లు చొప్పున 1989లో అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. అంతా గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కాట్రావత్ సాంబయ్య నాయక్ 2022లో గుడిసెలకు నిప్పంటించాడు. అతనిపై కేసు నమోదు కాగా మూడు నెలల జైలుశిక్ష అనుభవించాడు. అనంతరం తిరిగి సుగాలీలకే పట్టాలు మంజూరు చేయాలని హైకోర్టు నుంచి జిల్లా కలెక్టర్‌కు ఉత్తర్వులు అందాయి. దీంతో కొందరు తిరిగి గుడిసెలు నిర్మించుకొని నివాసముంటున్నారు. అప్పటి నుంచి ఊరుకున్న సాంబయ్య నాయక్ ప్రస్తుతం టీడీపీ అండతో, తండాలో ఎవరూలేని సమయం చూసుకొని పొక్లెయిన్‌తో గుడిసెలను కూలగొట్టాడు. దీంతో బాధితులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. కోర్టు ఉత్తర్వుల ఉన్నప్పటికీ గుడిసెలు కూల్చిన సాంబయ్య నాయక్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కె.పుల్లారావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్.శివానాయక్, పీడీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, పి.రాము నాయక్, పి.సాంబబాయి, కేతావత్ శ్రీరాములు నాయక్, వి.బాలసింగ్‌నాయక్, కె.కృష్ణనాయక్, కె.రమాదేవి, ఆర్.హనుమానాయక్, ఆర్.మణి బాయి పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాల మేరకు చర్యలు

బాలాజీనగర్‌తండాకు చెందిన ఎస్టీలు ఇచ్చిన అర్జీని పరిశీలించాను. భూ సమస్యపై ఇరువర్గాలు హైకోర్టుకు వెళ్లాయి. కోర్టు నుంచి వచ్చిన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– కె.పుల్లారావు, తహసీల్దార్, నకరికల్లు

మళ్లీ సర్కారు వారి పాట

- పట్టుబడిన పీడీఎస్ బియ్యంలో సగం సరుకుకు సరైన ధర రాలేదంట !
- 29న మళ్లీ వేలానికి ప్రకటన ఇచ్చిన జిల్లా అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నరసరావుపేట టౌన్: జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో అక్రమాలపై 'సర్కారు వారి పాట' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన 3391.55 క్వింటాళ్లకు పైగా పీడీఎస్ బియ్యాన్ని గతంలో వేలం నిర్వహించగా కిలో రూ. 32.50 పైసలకు ఓ పాటదారుడు దక్కించుకున్నారు. అనంతరం అతడు పూర్తిగా డబ్బు చెల్లించకపోవడంతో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ఈ నెల 7న తిరిగి వేలం నిర్వహించారు. ఇందులో ఐదుగురు మాత్రమే పాల్గొన్నారు. నకరికల్లు గ్రామానికి చెందిన రేషన్ బియ్యం అక్రమ వ్యాపారి తెర వెనుక చక్రం తిప్పాడు. కిలో రూ.22.50 ధర నిర్ణయించి కూటమి నేతలకు అధికారులు అప్పగించారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి సుమారు రూ.35 లక్షలు గండి పడింది. ఈ వ్యవహారంపై సాక్షి దినపత్రికలో ఈనెల 14న కథనం వెలువడటంతో జిల్లా పౌరసరఫరా శాఖ అధికారులు దిద్దుబాటు చర్యలకు దిగారు. ఈ నెలలో ప్రకటించిన వేలంలో 3391.55 క్వింటాళ్లకు గాను 1519.40 క్వింటాళ్లకు సరైన ధర రాలేదని, ఈ నెల 29న తిరిగి మరో మారు నిర్వహించబోతున్నామని తాజాగా ప్రకటన ఇచ్చారు. ఈ వేలంలో పాల్గొనదలచిన వారికి ఉండాల్సిన అర్హతలను అందులో పేర్కొన్నారు. ముందుగా రూ.లక్ష ధరావతు చెల్లించాలని, మిల్లులకు సంబంధించి లైసెన్సు ఉండాలని తెలిపారు. పాటలో పాల్గొనే వారిపై 6-ఏ కేసులు ఉండరాదని డీఎస్‌వో నారదముని పేర్కొన్నారు.

క్లుప్తంగా

విజిలెన్స్ కమిటీలో నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట: జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలో అనధికారిక సభ్యుల నియామకానికి ఈనెల 29వ తేదీలోగా ఎస్సీ, ఎస్టీలు, ప్రభుత్వేతర సంస్థల ప్రతినిధులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి బి.శివనాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రకాష్‌నగర్, ఏ–1 కన్వెన్షన్ హాలు పక్కనే ఉన్న కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించి, పూర్తిచేసి అందజేయాలని ఆయన సూచించారు.

సాగర్ డ్యాంను సందర్శించిన సీఈ



విజయపురి సౌత్: నాగార్జున సాగర్ ప్రాజెక్టు మెయిన్ డ్యాం ఎడమ వైపున ఎర్త్ డ్యాంపై ఎండిపోయిన కార్పెట్ గ్రాస్‌కు బుధవారం సాయంత్రం నిప్పంటుకుని పూర్తిగా తగలబడింది. అగ్ని ప్రమాదంలో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు గురువారం నల్లగొండ జిల్లా చీఫ్ ఇంజినీర్ అజయ్‌కుమార్, సాగర్ డ్యాం సర్కిల్ ఈఈ శ్రీధర్ రావు, ఈఈ మల్లికార్జునరావు, ఇంజనీర్లు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాను నిలిపి వేశామని, తిరిగి లైన్లు కలిపితే ఏ మేరకు నష్టం జరిగిందో తెలుస్తుందని చెప్పారు. కేబుల్స్ కాలిపోయినా, సీసీ కెమెరాలు బాగానే ఉన్నట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో జరిగిన నష్టాన్ని త్వరలో తేలుస్తామని, తిరిగి కేబుల్స్‌ను ఆధునికీకరిస్తామని చెప్పారు. ఈసారి అగ్ని ప్రమాదాలు జరిగినా నష్టం జరగకుండా జీఏ పైపుల నుంచి హెచ్‌డీ పైపులు వేసి, అందులో నుంచి కేబుల్స్ వచ్చేలా చూస్తామని ఆయన వివరించారు.

పోలీస్ కస్టడీకి సోషల్ మీడియా యాక్టివిస్టు రాకేష్‌గాంధీ

చిలకలూరిపేట: సోషల్ మీడియా యాక్టివిస్టు దొడ్డా రాకేష్ గాంధీని రెండు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ న్యాయమూర్తి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బెయిల్ మంజూరు చేయాలని అతని తరపు న్యాయవాదులు, కస్టడీకి అప్పగించాలని పోలీసు తరపు న్యాయవాదులు బుధవారం చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వాదనలు వినిపించారు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి రాకేష్ గాంధీ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేశారు. అతడిని రెండు రోజుల పాటు చిలకలూరిపేటలో పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు న్యాయవాది దాసరి చిట్టిబాబు తెలిపారు.

రైల్వే గేట్ల కష్టాలకు తెర

- తీరనున్న పల్నాడువాసుల చిరకాల కోరిక
- మూడు ఓవర్ బ్రిడ్జిల మంజూరు
- కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు, ప్రయాణికులు



పెదకూరపాడు వద్ద రైల్వే గేటు పడటంతో నిలిచిన వాహనాలు

పెదకూరపాడు: సత్తెనపల్లి – అమరావతి మార్గంలో ప్రయాణికుల రైల్వే గేట్ల కష్టాలకు త్వరలో తెరపడనుంది. ఈ మార్గంలో పెదకూరపాడు వద్ద రోజుకు 40 సార్లు దాకా గేటు పడుతోంది. ప్రతిసారి 8 నుంచి 10 నిమిషాలు వరకు వాహనాలు నిలిచిపోతున్నాయి. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల పరిధిలో 30 గ్రామాల ప్రజలు, సత్తెనపల్లి పట్టణంలో అనేక కాలనీల్లోని ప్రజలు రైల్వే గేటుతో నిత్యం అవస్థలు పడుతున్నారు. ఇదే దుస్థితి పల్నాడు ప్రాంతాల్లో అనేక గ్రామాల్లో ఉంది.

ఆర్‌ఓబీలు మంజూరు

పల్నాడు జిల్లాలో హైదరాబాద్ రైల్వే మార్గంలో మూడు చోట్ల లెవెల్ క్రాసింగ్ గేట్లు వద్ద ఆర్‌ఓబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జిలు)ను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. నిర్మాణానికి సంబంధించిన గెజిట్‌ను రైల్వే శాఖ గెజిట్‌ను బుధవారం విడుదల చేసింది. సత్తెనపల్లి–అమరావతి రోడ్డులో (కాలచక్ర రహదారి) పెదకూరపాడు యార్డు వద్ద ఎల్‌సీ నెంబర్ 27 వద్ద, వెన్నాదేవి –కంకణాలపల్లి రోడ్డు, దాచేపల్లి–కేసానుపల్లి రోడ్డులోని తమ్మలచెరువు –నడికూడి స్టేషన్ల మధ్యలో ఎల్‌సీ నంబర్ 81 దగ్గరున్న లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద ఆర్‌ఓబీలు మంజూరు చేసింది.

ట్రాఫిక్, ప్రమాదాల నివారణకు చెక్

ఈ రహదారిలో నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తాయి. క్రాసింగ్ గేట్ల వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మాణం చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారు. బ్రిడ్జిలు నిర్మాణం జరిగితే నిత్యం ప్రయాణికుల కష్టాలు తీరతాయి. ప్రమాదాలను కూడా నివారించవచ్చు. ఆర్టీసీ, ప్రైవేట్ పాఠశాల బస్సులతో పాటు లారీలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందులు తప్పుతాయి.

ఫలించిన కల



పెదకూరపాడు కాలచక్ర రహదారిలో రైల్వే గేట్లు వద్ద ఆర్‌ఓబీ ఏర్పాటు చేయాలని చిరకాలంగా కోరుతున్నాం. దశాబ్దాల నుంచి పోరాటం కొనసాగిస్తున్నాం. ఇప్పటికి ఈ కల నెరవేరనుంది. రాజధానికి వెళ్లే ప్రధాన రహదారిలో కాలచక్ర ఒక్కటి. ఈ మధ్య ఈ రహదారిపై ట్రాఫిక్ పెరిగింది. బ్రిడ్జినిర్మాణం జరిగితే ట్రాఫిక్, ప్రయాదాలను నివారించవచ్చు.

–బాలి సైదా, న్యాయవాది, పెదకూరపాడు

అభినందనీయం



పెదకూరపాడు రైల్వే గేట్లు వద్ద బ్రిడ్జి నిర్మాణం అభినందనీయం. ఇక్కడ నిత్యం 40 సార్లు గేటు పడుతోంది. సుమారు 10 నిమిషాలు వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి. విద్యార్థులు, ఉద్యోగస్తులు అవస్థలు పడుతున్నారు. రాజధాని ప్రాంతంలో కాలచక్ర రహదారిపై బ్రిడ్జి నిర్మాణం అవసరం. అభివృద్ధి చెందే ప్రాంతం కావడంతో ఇక్కడ హైదరాబాద్‌కు వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లు కూడా హాల్ట్ కల్పించాలి.

–కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతిశ్రీ,
అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి,పెదకూరపాడు

122 దరఖాస్తులను ఆమోదించిన పరిశ్రమల శాఖ



కార్యాలయంలో సమీక్ష చేస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్, అధికారులు

నరసరావుపేట: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటులో భాగంగా సింగిల్ డెస్క్ పోర్టల్‌పై ఈ నెలలో వచ్చిన 129 దరఖాస్తులకు గాను 122ను ఆమోదించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎం.సుధాకర్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పలు అంశాలపై జేసీ సమీక్ష చేశారు. సింగిల్ డెస్క్ పోర్టల్ క్లియరెన్స్, ఎస్సీ, ఎస్టీలకు పెట్టుబడి రాయితీ, పారిశ్రామిక అభివృద్ధిలో రాయితీ విధానం, ప్రధాన మంత్రి ఉపాధి కల్పన, సులభతర వ్యాపారంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, క్లస్టర్ డెవలప్‌మెంటు ప్రోగ్రాం తదతర పలు అజెండాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధాన మంత్రి ఉపాధి హామీ పథకానికి సంబంధించిన కేవైసీ ద్వారా దరఖాస్తుల ప్రాసెస్ వేగవంతంగా చేయాలని చెప్పారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో ఇప్పటి వరకు 4950 మందికి శిక్షణ ఇచ్చామని, 3,357 దరఖాస్తులను బ్యాంకులకు పంపించామని జేసీ తెలిపారు. ఇందులో 521 మంజూరై 452 యూనిట్లకు రుణాలు విడుదల చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని రైతు మృతి

కారెంపూడి: గుర్తు తెలియని వాహనం ఢీకొని రైతు మృతి చెందిన ఘటన మండలంలోని నరమాలపాడులో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు మాదరాజు రవి తెల్లవారుజామున అడిగొప్పల వైపు రోడ్డు పక్క నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో రవి (31) అక్కడికక్కడే మృతి చెందాడు. ఐదు గంటలకు అటుగా పొలం పనులకు వెళ్తున్న వారు చూసి బంధువులకు సమాచారం అందించారు. రవి కుడి చేయి గూడ దగ్గర విరిగిపోయింది. కుడి కాలుపై బలమైన గాయం కన్పిస్తోంది. ఎస్‌ఐ వాసు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు కవల ఆడపిల్లలున్నారు. ఈ ఘటనతో గ్రామంలోని బీసీ కాలనీలో విషాదం అలుముకుంది.

ఆధునిక సాంకేతికతతో మెరుగైన పనితనం

శిక్షణలో పోలీసు సిబ్బందికి సూచించిన జిల్లా ఎస్పీ



సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని మెరుగైన విధి నిర్వహణను కనబర్చాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజుల పాటు పలు పోలీసుస్టేషన్ల నుంచి హాజరైన 55మందికి నూతన చట్టాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కానిస్టేబుళ్లలో పలువురు ఉన్నత విద్యతో పాటు ఎన్నో నైపుణ్యాలు కలిగిన వారు ఉన్నారని తెలిపారు. వాటిని వెలికితీసి, మెరుగులు దిద్ది స్టేషన్‌లో అన్ని విధులు నిర్వర్తించేలా తర్ఫీదు ఇవ్వడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని చెప్పారు. పనులను అందరూ పంచుకోవడం వల్ల ఒత్తిడి, భారం తగ్గుతుందని తెలిపారు. అప్పుడు చేసే పని చాలా సులువుగా మారి, పని చేయాలన్న ఉత్సాహం పెరుగుతుందని పేర్కొన్నారు. స్టేషన్‌లో ఫిర్యాదు రాసే దగ్గర నుంచి రఫ్ స్కెచ్, ఆధారాల సేకరణ, సాక్షుల వాంగ్మూలాలు రాయడం, చార్జిషీటు తయారు చేయడం, అరెస్టు కార్డు రాయడం వంటి అన్ని పనులను అందరూ నేర్చుకోవాలని ఆయన సూచించారు. దీనివల్ల కేసుల్లో దర్యాప్తు త్వరగా పూర్తి చేసి నేరస్తులకు తగిన శిక్షలు వేయించడానికి వీలవుతుందని వివరించారు. తద్వారా బాధితులకు సకాలంలో న్యాయం చేసిన వారమవుతామని ఎస్పీ స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ, ఎస్టీ సీఐ బి.రమేష్‌బాబు పర్యవేక్షణలో నిర్వహించిన శిక్షణకు ట్రాఫిక్ సీఐ లోకనాథం, డీసీఆర్‌బీ సీఐ ఎం.శ్రీనివాసరావు, మహిళా పోలీసుస్టేషన్ సీఐ కేవీ సుభాషిణి, డీఎస్‌బీ ఎస్‌ఐ ఏ. శశికుమార్, డీసీఆర్‌బీ మహిళా ఎస్‌ఐ జి.అరుణజ్యోతి హాజరై శిక్షణ ఇచ్చారు.

మిర్చి రైతులకు సాగునీటి కష్టాలు

ఎన్‌ఎస్పీ డీఈని కలిసి వినతిపత్రం అందజేత



డీఈకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు

నరసరావుపేట: జిల్లాలో వారబందీ అమలులో ఎండ తీవ్రతకు మిర్చి పంట ఎండిపోతోందని, తక్షణమే సాగునీరు విడుదల చేసి పంటలను రక్షించాలని ఏపీ రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రొంపిచర్ల మండలం వీరవట్నం గ్రామానికి చెందిన మిర్చి రైతులతో కలిసి నాగార్జునసాగర్ సంతగుడిపాడు సర్కిల్ డీఈ ఎస్.విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ లక్షల రూపాయల పెట్టుబడులు ఒకవైపు, చీడపీడల బెడద మరోవైపు, ధరలు లేమితో తీవ్ర ఆందోళనలో ఉన్న రైతులకు నీటి కష్టాలు తోడు కావడంతో మరింత ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని చెప్పారు. పంటకు నీరు ఇవ్వకపోతే తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. సాగునీటి కోసం ఆందోళన చెందడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. గతంలో నాగార్జునసాగర్ జలాశయంలో డెడ్ స్టోరేజ్ ఉన్న సమయంలో కూడా సాగుకు సరిపడా నీరు విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు. తక్షణమే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను ఏకంచేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న పంటలు, నీటి అవసరాలపై ఎన్‌ఎస్పీ అధికారుల దగ్గర వివరాలు లేకపోవడం వారి నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని తెలిపారు. ప్రస్తుతం సాగులో ఉన్న మిర్చి, మొక్కజొన్న, దాళ్వా వరి, ఇతర కూరగాయ పంటలు దెబ్బ తినకుండా ఏప్రిల్ 20 వరకు సాగు నీరు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన డీఈ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని, తక్షణమే నీరు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విలువలకు 'కూటమి' తూట్లు

- సూపర్ సిక్స్ హామీల అమలు ఎప్పుడు ?
- పంట కాలం ముగిసే వరకు సాగునీరు ఇవ్వాలి
- సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో గుంటూరు విజయకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

నరసరావుపేట: ప్రజాస్వామ్యం, విలువల గురించి ఎన్నికలకు ముందు మాట్లాడిన కూటమి ప్రభుత్వ నాయకులు అధికారంలోకి వచ్చాక వాటికి తూట్లు పొడుస్తున్నారని, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ విమర్శించారు. స్థానిక కోటప్ప కొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో గురువారం జిల్లా కమిటీ సభ్యులు వై.రాధాకృష్ణ అధ్యక్షతన పల్నాడు జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20వేలు ఇవ్వకుండా మొండిచేయి చూపారని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధరలు, దిగుబడులు లేక రైతాంగం అల్లాడుతోందని చెప్పారు. రైతుల పక్షాన మాట్లాడిన రైతు సంఘం నాయకులను టీడీపీ నాయకులు బెదిరిస్తున్నారని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని సమర్థంగా అమలు చేసి, వలసలు నివారించి, 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కూలీలు వలస వెళ్తున్న క్రమంలో ప్రమాదాల బారిన పడి ఆరుగురు చనిపోగా, 70 మందికి పైగా గాయపడ్డారని పేర్కొన్నారు. వారందరికీ న్యాయం చేయాలని విజయకుమార్ కోరారు. బసకచర్ల పేరుతో వరికపూడిశెల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ప్రజలు, రైతులను ఏకం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. వెనకబడిన పల్నాడు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు పార్టీ చేపట్టే పోరాటాలకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపాలని ఆయన కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో యూటీఎఫ్ ప్రకటించిన అభ్యర్థి విజయం కోసం పనిచేసిన నాయకులు, ప్రజాసంఘాలపై కూటమి నేతలు బెదిరింపులకు పాల్పడడం తగదని ఆయన ఖండించారు. ఎన్నికల రోజున ఓటమి భయంతోనే కూటమి నేతలు ఏజెంట్లపై దాడులు, రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఏపూరి గోపాలరావు, జి.రవిబాబు, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, ఎస్.ఆంజనేయనాయక్, సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.శివకుమారి పాల్గొన్నారు.

జయహో భారత్.. జయహో సునీత !

100 మీటర్ల జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తులసి, విద్యార్థులు

అచ్చంపేట: మహిళా శక్తికి ప్రతీకగా నిలచిన భారత సంతతి వ్యోమగామి సునీత విలియమ్స్ తొమ్మిది నెలల తరువాత సురక్షితంగా భూమిపైకి తిరిగి వచ్చిన సందర్భంగా మండలంలోని వేల్పూరు జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు 100మీటర్ల జాతీయ జెండాతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ టి.తులసి మాట్లాడుతూ సునీత విలియమ్స్ సురక్షితంగా భూమిపైకి వచ్చిన క్షణాలు అద్భుతమని, ఆమె ధైర్య సాహసాలు అనితరసాధ్యమని కొనియాడారు. ఈ విజయం యావత్ భారతావని గర్వించదగినదని పేర్కొన్నారు. సునీత విలియమ్స్ భారతదేశంలోని ప్రతి మహిళకు స్ఫూర్తిదాయకంగా నిలిచిపోతుందని తెలిపారు. జయహో భారత్..జయహో సునీత విలియమ్స్ అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అగస్టీన్‌రెడ్డి, ఉపాధ్యాయులు మస్తాన్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఊయలే ఉరి తాడైంది !

ఆగిన బాలుడి ఊపిరి



అద్విక్‌రెడ్డి మృతదేహం

రెంటచింతల: ప్రతి రోజూ సరదాపడి ఊగే ఊయలే తన ప్రాణం తీస్తుందని ఆ బాలుడు ఊహించలేకపోయాడు. రోజూ మాదిరే ఇంట్లో చీరతో కట్టిన ఊయల ఊగుతున్న సమయంలో మెడకు బిగుసుకుని ఊపిరాడక చిన్నారి మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా రెంటచింతలలో చోటుచేసుకుంది. వెంకటేశ్వర స్వామి మాణం కాలనీకి చెందిన సలిబండ్ల అద్విక్‌రెడ్డి(11) ఆరోగ్యం బాగో లేదని చెప్పి గురువారం పాఠశాలకు వెళ్లకుండా, అమ్మమ్మ ఇంటి పైగదిలో చీరతో కట్టిన ఊయల ఊగుతున్నాడు. మధ్యాహ్నం అన్నం తినడానికి కిందకు అద్విక్‌రెడ్డి రాకపోవడంతో అమ్మమ్మ కటకం శౌరీలు పైకి వెళ్లి చూసింది. ఊయల చీర అద్విక్‌రెడ్డి మెడకు బిగుసుకుని పోయి ఉండటం గమనించి కేకలు వేసింది. బంధువులు వెంటనే స్థానిక వైద్యుని దగ్గరకు తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. అద్విక్‌రెడ్డి స్థానిక ఫాతిమా విద్యానికేతన్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. బాలుడి తల్లి నిర్మలారాణి అదే పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేస్తోంది. తల్లి, బంధువులు రోదిస్తున్న తీరు అక్కడ వారిని కంట తడి పెట్టించింది. విద్యార్థి అద్విక్‌రెడ్డి అకాల మృతికి పాఠశాల డైరెక్టర్ ఏరువ మల్రెడ్డి, హెచ్‌ఎం ఏరువ స్టేఫీ స్టార్ సంతాపం తెలిపారు. పాఠశాలకు సెలవు ప్రకటించారు.

కిలోన్నర గంజాయి పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

అమరావతి: మండల పరిధిలోని ధరణికోట ఆరు డొంకల బావి సెంటర్ సమీపంలో గురువారం మధ్యాహ్నం పోలీసులు దాడి చేసి కిలోన్నర గంజాయిని పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ఆరు డొంకల బావి సెంటర్ సమీపంలోని పాగుబడిన కోళ్ల ఫారంలో గంజాయిని దాస్తుండగా పోలీసులు దాడి చేశారు. గమనించిన నిందితులు అక్కడే వదిలేసి పారిపోయారు. పోలీసులు కిలోన్నర గంజాయితో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ అచ్చియ్య మాట్లాడుతూ పారిపోయిన వారి కోసం పోలీసు బృందాలు, ఈగల్ టీంలు గాలిస్తున్నాయని తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకున్న తర్వాత కేసు నమోదు చేస్తామని ఆయన చెప్పారు.

దాడి ఘటనలో మహిళ మృతి

నగదు విషయంలో ఘర్షణ



సీతారత్నం (ఫైల్)



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పట్టణ సీఐ వెంకట్రావు, ఎస్‌ఐ మోహన్

పిడుగురాళ్ల: నగదు విషయంలో ఇద్దరి మధ్యా జరిగిన ఘర్షణలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లిలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా వాసుపల్లి సీతారత్నం (57) పని చేస్తోంది. ఇదే ఆరోగ్య కేంద్రంలో సత్తెనపల్లికి చెందిన మన్నెం శ్రీనివాసరావు హెల్త్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇద్దరి మధ్యా పరిచయం పెరిగి చనువుగా ఉంటున్నారు. సీతారత్నం బ్రాహ్మణపల్లిలో ఇల్లు అద్దెకు తీసుకొని నివసిస్తోంది. ఆమెకు భర్త లేడు. శ్రీనివాసరావుతో పరిచయం పెరిగి తరచూ ఇంటికి వస్తూ ఉండేవాడు. గురువారం రాత్రి ఇద్దరి మధ్యా నగదు విషయంలో మాటామాట పెరిగి గొడవకు దారితీసింది. ఈ క్రమంలో శ్రీనివాసరావు, సీతారత్నంపై దాడి చేసి బలంగా నెట్టడంతో తల భాగం గోడకు తగిలింది. తీవ్ర రక్తస్రావంతో ఘటనా స్థలంలోనే మృతి చెందింది. ఇరుగు పొరుగువారు గమనించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ శ్రీరామ్ వెంకట్రావు, ఎస్‌ఐ మోహన్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పరిశీలించారు. సీతారత్నం మృతికి కారకుడైన మన్నెం శ్రీనివాసరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్‌ఐ దీపిక తదితరులు

పెదకాకాని: రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పెదకాకానిలో జరిగింది. పెదకాకాని సుందరయ్యకాలనీకి సమీపంలో రైల్వేట్రాక్‌పై మృతదేహం ఉన్నట్లు గురువారం తెల్లవారుజామున పైలెట్ ద్వారా గుంటూరు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి రైల్వే ఎస్సై కె.దీపిక సిబ్బందితో చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి సమీపంలో డ్రైవింగ్ లైసెన్స్ కనిపించడంతో దాని ఆధారంగా మృతుడు పెదకాకానికి చెందిన పంది గోపీకృష్ణ(32)గా గుర్తించారు. మృతుడి కాళ్లు చేతులు దూరంగా పడి ఉన్నాయి. మృతుడి తండ్రి సాంబశివరావు నాలుగేళ్ల కిందట మరణించారు. గోపీకృష్ణకు తల్లి జ్యోత్స్న, తమ్ముడు ఉన్నారు. అతడు లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇంకా పెళ్లి కాలేదు. ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ కడలి దీపిక తెలిపారు.